ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



5 సిద్దిపేట

శనివారం 28 సెప్టెంబరు 2024

అప్పులపాలవుతున్న రైతులు

● రైతు భరోసా డబ్బు తక్షణమే ఇవ్వాలి ● పాస్‌బుక్ చూసి లోన్ ఇస్తే రేషన్‌కార్డుతో ఏం పని?
● అసెంబ్లీని స్తంభింపజేసైనా రుణమాఫీ చేయిస్తా ● పదవుల కంటే ప్రజలే ముఖ్యం ● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి/నంగునూరు, సెప్టెంబరు27: సమయానికి రైతుభరోసా పెట్టుబడి సాయం డబ్బు అందకపోవడంతో రైతులంతా అధిక వడ్డీకి అప్పులు తెస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.3 చొప్పున వడ్డీ చెల్లిస్తూ తెచ్చిన డబ్బులతో వ్యవసాయం చేసే పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. శుక్రవారం నంగునూరు మండల కేంద్రంలో జరిగిన రైతు ధర్నాకు హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బ్యాంకులో రుణాలు ఇచ్చేప్పుడు పాస్‌బుక్ చూస్తారని, ఇప్పుడేమో రుణాలను మాఫీ చేయడానికి రేషన్‌కార్డు ఎందుకు చూస్తున్నారని ప్రశ్నించారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు పేరిట కాంగ్రెస్ సర్కారు రైతులను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి తప్పారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ జరగని వాళ్లెవరైనా ఉంటే ధర్నాకు రావాలని తాను ఇచ్చిన పిలుపునకు భారీగా తరలివచ్చారన్నారు. నంగునూరు మండలంలో 11వేల మంది రైతుల్లో 5వేల మందికి మాత్రమే మాఫీ అయ్యిందని హరీశ్‌రావు ఆరోపించారు. మిగితావారందరికీ రుణమాఫీ జరిగేదాకా పోరాటం చేస్తానని, అవసరమైతే అసెంబ్లీని స్తంభింపజేస్తానని స్పష్టం చేశారు. రుణమాఫీ విషయంలో తాను రాజీనామాకు కూడా సిద్ధమని తెలిపారు. తనకు పదవుల కంటే ప్రజలే ముఖ్యమన్నారు. రుణమాఫీ, రైతుభరోసాతో పాటు ఆరుగ్యారంటీలు కూడా అబద్ధాలేనని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాక్రిష్ణశర్మ, నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, అనగోని లింగంగౌడ్, కోల రమేశ్‌గౌడ్, దువ్వల మల్లయ్య, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



నంగునూరు రైతుధర్నాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు



తమకు రుణమాఫీ వర్తించలేదని
చేతులెత్తి నిరసన తెలుపుతున్న రైతులు

రూ.3 చొప్పున మిత్తికి తెచ్చి సాగు చేశా..

- దుర్గారెడ్డి, రైతు నంగునూరు



నాకున్న ఎకరం పైచిలుకు భూమిలో సాగుకోసం రూ.58వేలు మాత్రమే బ్యాంకులో లోన్ తీసుకున్నా. రుణమాఫీకై బ్యాంకుకు వెళితే వ్యవసాయశాఖ అధికారుల దగ్గరికి పొమ్మని చెప్పారు. బ్యాంకు వాళ్లు మాత్రం అప్పు తీసుకొని 11 నెలలు అయింది ప్రభుత్వం ఇంకా మొత్తం మాఫీ చేయలేదు. మళ్లీ రెన్యూవల్ చేసుకోవాలంటున్నరు. రూ.3చొప్పున వడ్డీకి తెచ్చి పంటలను సాగు చేశా.

రుణమాఫీకి రేషన్‌కార్డుకు లింక్ ఏంటో

- మల్లారెడ్డి రైతు, దర్గపల్లి



రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు పూర్తిగా విస్మరించింది. రేషన్ కార్డుకు బ్యాంకు రుణానికి లింకు పెట్టడం ఏంటో అర్థం కావడం లేదు. అప్పు ఇచ్చేటప్పుడు రేషన్ కార్డు అడగలేదు. భూమి పాసుబుక్‌తో ఇచ్చారు. ఇప్పుడు లింకులతో ఇబ్బంది పెట్టడం సరికాదు.

రైతుబంధు రాలే.. రుణం మాఫీ కాలేదు

- మమత, రైతు, గట్ల మల్యాల



రెండు ఎకరాల భూమిని బ్యాంకులో పెట్టి రూ.లక్ష అప్పు తీసుకుని సాగు చేస్తున్నాం. ఈసారి రైతుబంధు రాక ఇబ్బందులు పడుతుంటే మరోవైపు పంట రుణమాఫీ అవ్వక అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది.

బకాయిలకే సరి

నిర్వహణ గాలికి!

● ఎస్‌ఎఫ్‌సీ కింద జిల్లాకు రూ.6.47కోట్లు
● గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు
● అందులోనే ట్రాక్టర్ ఈఎంఐ, కరెంటుబిల్లులు చెల్లింపు
● అటకెక్కిన పాత పనుల బకాయిలు
● పెండింగ్ బిల్లులు అందక కార్యదర్శులకు తప్పని అవస్థలు

దుబ్బాక, సెప్టెంబరు 27 : ఎట్టకేలకూ రెండేళ్ల తర్వాత గ్రామపంచాయతీలకు ఎస్‌ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) నిధుల విడుదలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని సుమారు రూ.6,47,66,992ను విడుదల చేయడానికి అంచనాలను గ్రామకార్యదర్శులను కోరింది. జిల్లాలోని 499 గ్రామపంచాయతీల్లోని వీటిని జనాభా ప్రాతిపదికన విడుదల చేయడానికి సర్కారు పూనుకుంది. ఈ నిధులను వినియోగించడానికి కొన్ని నిబంధనలను కూడా విధించింది. జిల్లాలోని 2,180 మంది గ్రామపంచాయతీ సిబ్బందికి ఆగస్టు నెల వేతనాలకుగాను రూ.2,19,45,511 విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం రెండు రోజుల క్రితం జీవోను విడుదల చేసింది. అలాగే కరెంటు బిల్లుల బకాయిలు చెల్లించాల్సిందిగా ఆదేశాలిచ్చింది. పంచాయతీల్లోని కరెంటు బిల్లుల బకాయిలు సుమారు రూ.కోటిన్నరను, పంచాయతీ ట్రాక్టర్ల ఈఎంఐలు రూ.16,72,461 చెల్లించాల్సిందిగా సూచించింది. మిగిలిన నిధులను 3వేల జనాభా కలిగిన గ్రామపంచాయతీలకు రూ.50వేల చొప్పున రూ.2కోట్లా26లక్షల50వేలు, మూడు నుంచి ఎనిమిది వేల జనాభా కలిగిన గ్రామపంచాయతీలకు 75వేల చొప్పున రూ.3కోట్ల45లక్షలను కేటాయిస్తున్నట్లు తెలిపింది. ఇందులో మొత్తం పాత బకాయిలకే నిధులను మంజూరు చేసి చేతులు దులుపుకున్నట్లు ప్రభుత్వం చెప్పకనే చెప్పింది.

అప్పులు తీరేదెట్ల..?

పంచాయతీల నిర్వహణకు ప్రభుత్వం రెండేళ్ల నుంచి ఒక్క పైసా కూడా విదల్చలేదు. ప్రతీ పంచాయతీ నుంచి నిర్వహణ భారాన్ని పదవిలో ఉన్నన్నాళ్ల సర్పంచులు మోశారు. ఆ తర్వాత పదవీకాలం ముగుస్తుండడంతో ఆ భారాన్ని కార్యదర్శుల పైన వేశారు. పంచాయతీల్లోని ట్రాక్టర్ డీజిల్, రిపేర్లను కార్యదర్శులే అప్పులు చేసి నిర్వహించారు. బ్లీచింగ్, దోమల మందు, గడ్డి మందు, మోటార్లను కూడా వారే రిపేరు చేయించారు. గ్రామంలో తరుచూ మిషన్ భగీరథ పైపులైన్ పగడం, వాటి మరమ్మతులు కూడా కార్యదర్శులకు భారంగా మారాయి. వీధి దీపాల ఏర్పాటు, కొనుగోలు, మరమ్మతులు ఇలా ప్రతిదీ వారిపై పడింది. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కూడా వీరే సొంత డబ్బులతో నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఒక్క పైసా రాకున్నా స్వచ్ఛదనం, పచ్చదనం, స్వచ్ఛతాహీ సేవ, తదితర కార్యక్రమాల నిర్వహిస్తున్నారు. చిన్న గ్రామపంచాయతీకి రూ.3లక్షల వరకు, మధ్యతరహా గ్రామ పంచాయతీ (2వేల నుంచి 5వేల జనాభా) లో రూ.2లక్షల నుంచి 4 లక్షల వరకు, పెద్ద గ్రామపంచాయతీల్లో సుమారు రూ.8లక్షల వరకు బకాయిలు ఉంటాయని కార్యదర్శులు చెబుతున్నారు. ఆయా పనులు అప్పులు చేసి తీసుకొచ్చామని, వడ్డీలు అంతకంతకూ పెరుగుతు న్నాయని వారు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి ఎస్‌ఎఫ్‌సీ నిధులను పూర్తిగా విడుదల చేయాలని వారు కోరుతున్నారు.



సిద్దిపేట
జిల్లా మ్యాప్



మోతె
గ్రామపంచాయతీ
భవనం

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో రసాభాస

● తులం బంగారం ఏమైంది అంటూ బీఆర్‌ఎస్ ప్లకార్డులు
● పోటీగా కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలు
● మంత్రి సురేఖ ప్రసంగిస్తుండగానే ఇరువర్గాల తోపులాట

చేర్యాల, సెప్టెంబరు 27: చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కుల పంపిణీలో రసాభాస జరిగింది. మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేసేందుకు శుక్రవారం చేర్యాల శివారులో నిర్వహించిన కార్యక్రమం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య గొడవకు కారణమైంది. ఇప్పటికే జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మధ్య ప్రొటోకాల్ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తుగానే భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. లబ్ధిదారులను మాత్రమే లోపలికి అనుమతించారు. దీనిపై బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో వారిని అనుమతించారు. తర్వాత కాంగ్రెస్ కార్యకర్తలు సభకు వచ్చారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులను పలకరిస్తున్న క్రమంలో 'జై కాంగ్రెస్, జై కొమ్మూరి' అంటూ నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్ వర్గీయులు సైతం 'జై పల్లా.. జైజై బీఆర్‌ఎస్' అంటూ నినాదాలు చేశారు. ఇదే సమయంలో మంత్రి వచ్చారు. సభలో ఎమ్మెల్యే ప్రసంగిస్తుండగా ఇరువర్గాలు పోటాపోటీ నినాదాలు చేశారు. మంత్రి సురేఖ కల్పించుకొని ఇరు పార్టీల వారు సంయమనం పాటించాలని సూచించారు. గొడవ సద్దుమణిగిందనుకుంటున్న సమయంలో బీఆర్‌ఎస్ నాయకులు కల్యాణలక్ష్మిలో ప్రకటించిన తులం బంగారం ఎప్పుడిస్తారంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రతిగా కాంగ్రెస్ వారు నినాదాలు చేస్తూ కుర్చీలు లేపి.. బీఆర్‌ఎస్ నాయకుల వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలను నెట్టివేయగా, కొందరు కిందపడ్డారు. పోలీసుల తీరుపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడవ ముదురుతుండటంతో మంత్రి సురేఖ ప్రసంగం ముగించి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి వెళ్లిపోయారు.



మంత్రి కొండా సురేఖను జ్ఞాపిక అందించి
సత్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ప్రజలకోసం పనిచేస్తాం

పాలకపక్షమైనా, ప్రతిపక్షంలో కొనసాగినా, ప్రజల సంక్షేమం కోసం పాటుపడటమే కాంగ్రెస్ అభిమతమని అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఇందిరమ్మ రాజ్యస్థాపనతో పాటు తెలంగాణ సాధన ఫలితాన్ని ప్రజలకు అందించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని ఆమె తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచిని గ్రహించి ప్రతిపక్షాలు సూచనలు, సలహాలు అందించాలని చెప్పారు. ప్రజలకు మేలు చేసే ప్రతీపనిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

అక్కా.. అంటూ పల్లా సంబోధన

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంత్రి కొండా సురేఖను కొనియాడారు. ప్రతీమాటకు అక్క అని సంబోధించారు. ప్రభుత్వం ఏదని కాకుండా ప్రజల అవసరాలు తీర్చడమే ఏకైక లక్ష్యంగా పాటుపడుతూ ఎవరికి కష్టంవచ్చినా స్పందించే గుణం కలిగిన నిఖార్సయిన నాయకురాలని ప్రశంసించారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూలిమిట్ట మండలాల్లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించాలని, మల్లన్న ఆలయానికి అందించిన 132 ఎకరాల భూమిని పలువురు ఆక్రమిస్తున్నారని, పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. మంత్రి స్పందించి తప్పక నిధులు మంజూరు చేస్తానని తెలపడంతో కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీశ్, తుమ్మలపల్లి లీల, యాట కనకమ్మ, తార పాల్గొన్నారు.

'పల్లా' కావాలనే రెచ్చగొట్టారు : మంత్రి సురేఖ

చేర్యాలకు వచ్చిన మంత్రి సురేఖను జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గాంధీ చౌక్ వద్ద పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమానంతరం ఆమె కొమ్మూరి ఇంటికి వెళ్లి కార్యకర్తలు, నేతలతో మాట్లాడారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కార్యకర్తలను రెచ్చగొట్టి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రచ్చచేయించారని మంత్రి సురేఖ ఆరోపించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్న చోట ఆ పార్టీ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలోనే ప్రభుత్వ కార్యక్రమాలు జరిగేవని, ప్రొటోకాల్ ఉండేది కాదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే విధానం పాటిస్తున్నా కావాలనే గొడవలు చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గానికి సంబంధించి నామినెటెడ్ పదవులు సహా ఎలాంటి ప్రతిపాదనైనా కొమ్మూరి ద్వారానే ప్రభుత్వానికి అందించనున్నట్లు స్పష్టం చేశారు.



బీఆర్‌ఎస్ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ
కుర్చీలు పైకిలేపిన కాంగ్రెస్ నాయకులు



తులం బంగారం ఏమాయే అంటూ ప్లకార్డులు
ప్రదర్శించి నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు రావొద్దు

● అధికారులకు కలెక్టర్ మనుచౌదరి ఆదేశం

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 27: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రావొద్దని పకడ్బందీగా కొనుగోలు ప్రణాళికలు చేపట్టాలని సంబంధితశాఖ అధికారులను కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ శుక్రవారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో సంబంధితశాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో నవంబరు 2024 నుంచి జనవరి 2025 నాటికి నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం రానుందని అందుకు అనుగుణంగా 417 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఎక్కడా ఎటువంటి సమస్యలకు తావులేకుండా ముందుగానే ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ధాన్యం గ్రేడ్-ఎ రకం ప్రతి క్వింటాలుకు రూ. 2,320, ఇతర సాధారణ రకాలు ప్రతీ క్వింటాకు రూ. 2,300 నిర్ణయించిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, గన్నీ సంచుల కొరత లేకుండా ముందుగానే సమకూర్చుకోవడంతో పాటు అవసరం మేర అదనంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 3,641 మిల్లింగ్ కెపాసిటీ గల 148 రైస్‌మిల్లులు ఉండగా వాటికి కేంద్రాల నుంచి ధాన్యాన్ని తరలించడంలో ట్రాన్స్‌పోర్టు సమస్యలు తలెత్తకుండా ముందుగానే చూసుకోవాలన్నారు. 2023-24 సీఎంఆర్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, డీఏవో రాధిక, సివిల్ సప్లయ్ అధికారి తనూజ, డీఎం ప్రవీణ్, పీడీ మెప్మా హన్మంత్‌రెడ్డి, రవాణాశాఖ అధికారి శంకర్ నారాయణ, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

ఘనంగా సీఎస్ఐ ఆవిర్భావ దినోత్సవం

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 27 : ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి ఆఫ్ సౌత్ ఇండియా సంఘం(సీఎస్ఐ) 78వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో డయాసిస్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మెదక్ డయాసిస్ బిషప్ రెవరెండ్ డాక్టర్ కె.రూబెన్‌మార్క్ దైవసందేశం అందించారు. మహాలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. మహిళలు ఉత్సాహంగా కోలాటం ఆడారు. చర్చి నుంచి మెదక్ చౌరస్తా వరకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. చర్చికి అనుబంధంగా సేవలు అందించిన మిషన్ ఆస్పత్రి గతంలో మూతపడగా, కొత్త భవనాలను నిర్మించి మళ్లీ ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చారు. బిషప్ డాక్టర్ కె.రూబెన్‌మార్క్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రెడ్డి ఆస్పత్రిని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య, మున్సిపల్ చెర్మన్ తొడుపునూరి చంద్రపాల్, మత గురువులు పాల్గొన్నారు.



కడమంచి పోచవ్వ గొంతు మూగబోయింది

● అనారోగ్యంతో కన్నుమూత

నంగునూరు, సెప్టెంబరు 27 : శారద కథాగానంతో ప్రసిద్ధి చెందిన కడమంచి పోచవ్వ గొంతుమూగబోయింది. నంగునూరు పరిధిలోని రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన శారద కథా కళాకారిణి కడమంచి పోచవ్వ (68) అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం కన్నుమూశారు. నాలుగున్నర దశాబ్దాలుగా తెలంగాణలోని వివిధ ప్రాంతాలలో పోచవ్వ తన భర్త కడమంచి బుచ్చయ్యతో కలిసి అల్లిరాణి, మైరావణ, సర్దార్ పాపన్న, సదాశివరెడ్డి కథాగానంతో లక్షల ప్రదర్శనలు ఇచ్చారు. గ్రామాల్లో బుచ్చయ్య, పోచవ్వల కథ నడుస్తుదంటే జనం తండోపతండాలుగా వచ్చి వీక్షించేవారు. కథాగానంతో ప్రసిద్ధి చెందినా... వీరు పేదరికంలోనే బతికారు. క్రమంగా ఈకళకు ఆదరణ తగ్గడంతో పూటగడవక అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో కొంతకాలంగా తీవ్ర అనారోగ్యానికి గురైన పోచవ్వ తుదిశ్వాస విడిచారు. ఆమె మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.



పోచవ్వ (ఫైల్)


సమష్టి కృషితోనే అవార్డు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 27: సిద్దిపేట ఆర్టీసీ డిపోకు చెందిన సిబ్బంది ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని సమష్టి కృషితో పనిచేయడం ద్వారానే అవార్డులు వరిస్తున్నాయని రీజనల్ మేనేజర్ ప్రభులత తెలిపారు. సిద్దిపేట డిపో రాష్ట్రంలోనే ఉత్తమ డిపోగా అవార్డు అందుకున్న సందర్భంగా రూ.2లక్షల చెక్కును, అవార్డును డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డికి శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సిద్దిపేట డిపోను రాష్ట్రంలోనే ఉత్తమంగా నిలిపినందుకు సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. రోజువారీగా రూ.13లక్షల ఆదాయం రావాల్సి ఉండగా సిద్దిపేట డిపోకు 11లక్షల పైచిలుకు ఆదాయం వస్తుందని చెప్పారు. లక్ష్యాన్ని చేరడానికి సిబ్బంది మరింత కృషి చేయాలని కోరారు. అనంతరం లక్కీడిప్‌లో విజయం సాధించిన సిద్దిపేటకు చెందిన ముగ్గురు మహిళలకు బహుమతులను అందజేశారు. అవార్డు రావడానికి కృషి చేసిన సిబ్బందికి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి, దుబ్బాక ఇన్‌చార్జి కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న రీజనల్ మేనేజర్ ప్రభులత

పరిశ్రమల పనులు జరగనివ్వం 7
● కొనసాగుతున్న భూ నిర్వాసితుల ఆందోళనలు





మద్యం విక్రయిస్తే రూ.10 వేలు జరిమానా

● బాగిర్తిపల్లి గ్రామస్థుల ప్రతిజ్ఞ

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 27 : చిన్నశంకరంపేట మండలంలోని బాగిర్తి పల్లి గ్రామంలో గ్రామస్థులు ఏకమై మద్య నిషేధం విధించారు. శుక్రవారం రాత్రి గ్రామస్తులంతా గ్రామ చావిడి వద్ద సమావేశమై మద్యం నిషేధంపై తీర్మానం చేశారు. ఎవరైన గ్రామంలో మద్యం అమ్మితే రూ.10 వేలు జరిమానా విధించాలని, దీనికి గ్రామస్థులందరం కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.





నిర్లక్ష్యంతో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు!

● పట్టించుకోని ఉన్నతాధికారులు

● బాధ్యులపై చర్యలేవి?

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ హెచ్చరిస్తున్నా పలు సర్కిళ్ల అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుత్ డిమాండ్ పెరిగిన సబ్‌స్టేషన్లలో కోట్ల రూపాయలతో కొత్తగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్‌శాఖ ఏర్పాటు చేస్తోంది. అయితే కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల (పీటీఆర్) నిర్వహణ సరిగా లేకపోవడంతో తరుచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంగారెడ్డి సర్కిల్ ఇస్నాపూర్ ఇండస్ట్రియల్ సబ్‌స్టేషన్-2లో నెలరోజుల క్రితం ఫీడర్లు తరుచూ ట్రిప్పయినా అవేవి పట్టించుకోకుండా పీటీఆర్ ఆన్‌చేయడంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీనిపై కారణాలు గుర్తించి ఉన్నతస్థాయిలో రిపోర్టు అందచేయాల్సిన అధికారులు అవేవి పట్టించుకోలేదు. ఏ సబ్‌స్టేషన్‌లో అయినా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే దానిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి డబ్బులు తీసుకుని వారిని వదిలేశారనే ఆరోపణలున్నాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన డివిజన్, సబ్‌డివిజన్ అధికారులు కొంతమంది ఆర్టిజన్లు, లైన్‌మెన్లతో కలిసి ప్రైవేట్ కాంట్రాక్ట్ పనులు చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా సంగారెడ్డి, మేడ్చల్, సరూర్‌నగర్, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధిలో కొంతమంది అధికారులు బినామీ పేర్లతో కాంట్రాక్టు పనులు చేపడుతున్నారనే ఫిర్యాదులు కార్పొరేట్ కార్యాలయానికి వస్తుండటంతో వాటిపై విద్యుత్‌శాఖ ప్రత్యేక దృష్టిసారించింది.

ప్రేమిస్తున్నానని మోసం

● డబ్బులు, బంగారం దోచుకొని పెళ్లికి మొహం చాటు

● పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

తొగుట, సెప్టెంబరు 27 : ప్రేమిస్తున్నానని వెంటపడి... పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తొగుట ఎస్ఐ రవికాంత్ రావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన యువతితో తొగుట గ్రామానికి చెందిన చిలివేరి నరేష్‌గౌడ్ మూడేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన అతను యువతి వద్ద నుంచి ఆరు తులాల బంగారం, రూ.2,30,000 నగదును తీసుకున్నాడు. కాగా, కొన్ని రోజులుగా పెళ్లి చేసుకోమని యువతి కోరగా దాటవేస్తూ తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో మోసపోయనని గ్రహించిన యువతి కుటుంబీకులకు తెలుపగా శుక్రవారం వారు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట పోలీసులు తెలిపారు.

పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి

● ఎంపీడీవో దామోదర్

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 27: పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యాలయాల వద్దకు ప్రజలు చేరుకోవాలని ఎంపీడీవో దామోదర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పౌరహక్కుల దినోత్సవంలో అన్ని కుల సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

హత్యాయత్నం కేసులో దోషికి ఐదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 27 : హత్యాయత్నం కేసులో నేరం రుజువు కావడంతో దోషికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి ఎం.రాధాకృష్ణ చౌహాన్ శుక్రవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం... కొండాపూర్ మండల కేంద్రానికి చెందిన మహ్మద్ మోసిన్ సంగారెడ్డి పట్టణంలోని కల్వకుంటకు చెందిన షేక్ సాబేర్ (30) ఇంటి వద్దకు 2018 అక్టోబరు 10వ తేదీన వెళ్లగా పదివేల రూపాయల అప్పు విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో మహ్మద్ మోసిన్‌పై షేక్ సాబేర్ గొడ్డలితో తలపై దాడి చేశాడు. ఈ మేరకు బాధితుడు మోసిన్ సంగారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ లక్ష్మారెడ్డి దర్యాప్తు చేసి కేసుకు సంబంధించి పూర్తి ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో దోషికి శిక్ష ఖరారు చేశారు. జరిమానా చెల్లించకుంటే మరో మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి

పాపన్నపేట, సెప్టెంబరు 27: చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పాపన్నపేట మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలవల్ల చదువును మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించే అవకాశాలున్నాయన్నారు. ఈ పరీక్షలు రాయడానికి ఈ నెల 30 వ తేదీ వరకు ఫీజ్ చెల్లించవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్, ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ రియాజ్, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశం, అంజా గౌడ్, ప్రవీణ్, కృష్ణ కాంత్, యాదయ్య, అనిల్, నరసింహులు, నింగప్ప, రమేష్, జాకీర, పద్మ, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

కాళ్లకల్‌లో డీఎల్‌పీవో పర్యటన

● మురుగు నీటి కాలువ పరిశీలన

మనోహరాబాద్, సెప్టెంబరు 27: పొలంలోకి గ్రామ మురుగు నీరు రావడంతో పంట పాడవుతుందని కాళ్లకల్ గ్రామ రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తూప్రాన్ డీఎల్‌పీవో యాదయ్య, ఎంపీవో సతీష్ శుక్రవారం కాళ్లకల్ గ్రామంలోని రైతు పట్టా పొలాన్ని, గ్రామంలోని పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. గ్రామ మురుగు నీరు పంట పొలంలోకి రాకుండా చూస్తామని రైతుకు తెలిపారు. అనంతరం గ్రామ పారిశుధ్యంపై కార్యదర్శి రాజును అడిగి తెలసుకున్నారు. గ్రామ పరిశుభ్రత పై దృష్టి పెట్టాలని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజు రైతు గ్రామస్థులు రామాచారి, ఇతరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రాహుకాల పూజ



మర్పడగ క్షేత్రం లో పూజలు చేస్తున్న భక్తులు

కొండపాక,సెప్టెంబరు 27: మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శుక్రవారం రాహుకాల పూజ క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా విజయ దుర్గా మాతకు విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఉదయం పది గంటల నుంచి ఒంటి గంట వరకు రాహుకాల పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు చీకోటి రాజేంద్రప్రసాద్, తిరుపతిరెడ్డి, మర్యాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్ పట్టణంలోని అర్బన్ పార్కులో చివరి దశలో కాటేజీలు

అర్బన్ పార్కులో కాటేజీల సొమ్ము వృథానేనా..

గజ్వేల్ పట్టణంలో ఎంతో ఆర్భాటంగా నిర్మించిన కాటేజీలు రెండేళ్లు గడిచినా ప్రజలకు అందుబాటులోకి రాకపోవడంతో వృథాగానే ఉన్నాయి. రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన కాటేజీలు, డార్మిటరీ హాల్, గ్రీనరీ నిధులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. గత కలెక్టర్ పలుమార్లు కాటేజీలను సందర్శించినా సరిపడా నిధులు లేకపోవడంతో పనులు పూర్తిచేయలేదు. దీంతో కాటేజీల నిర్మాణానికి వెచ్చించిన ప్రజాధనం వృథాగా మారిందని చెప్పవచ్చు.


గజ్వేల్ పట్టణంలో వృథాగా మారిన ఆర్టీసీ బస్టాండ్

భవనాలున్నా.. వినియోగం సున్నా

రూ.కోట్లలో ప్రజాధనం వృథా

- నిరుపయోగంగా పలు ప్రభుత్వ భవనాలు
- శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకునే నాథుడే కరువు
- ఇప్పటికైనా ఉపయోగంలోకి తేవాలని కోరుతున్న ప్రజలు

గజ్వేల్, సెప్టెంబర్ 27: కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు వృథాగా మిగిలిపోయాయి. గజ్వేల్ పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. కోట్ల రూపాయలతో నిర్మించిన అనేక భవనాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. ఇందులో చివరిదశలో ఉన్న భవనాలు కొన్నైతే, ప్రజలకు దూరంగా మరికొన్ని ఉండడంతో ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. ఇతర ప్రభుత్వ అవసరాలకు సదరు భవనాలను వినియోగించాలన్న ధ్యాస కూడా ప్రస్తుత అధికారులకు లేకపోవడంతో రోజురోజుకూ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

శిథిలావస్థ దిశగా ఆడిటోరియాలు

గజ్వేల్ పట్టణంలోని బాలబాలికల ఎడ్యుకేషన్ హబ్‌లలో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆడిటోరియాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. తుది దశలో ఉన్న వీటికి చివరి దశ బడ్జెట్ కేటాయిస్తే పూర్తయ్యే అవకాశం ఉన్నా.. అధికారులు ఆ దిశగా చొరవచూపకపోవడంతో రోజురోజుకూ పనికిరాకుండా పోతున్నాయి.


గజ్వేల్ బాలికల ఎడ్యూకేషన్ హబ్‌లోని ఆడిటోరియం



సమీకృత భవనంలో పలు గదులు

గజ్వేల్ పట్టణంలోని సమీకృత భవన సముదాయంలో సైతం పలు కార్యాలయాల నిమిత్తం నిర్మించిన గదులు వృథాగా ఉన్నాయి. ఎ.బి.సి బ్లాకులుగా నిర్మించిన ఈ భవన సముదాయంలో బి బ్లాక్ మినహా ఏ, సీ బ్లాకులు నిరుపయోగంగా ఉంటున్నాయి. ఏ బ్లాక్ లో పోస్టాఫీస్ మినహా ఎటువంటి ఉపయోగం లేకపోగా, పంచాయతీరాజ్ ఈఈ ఆఫీసును ఇటీవల సీ బ్లాక్‌లో ఏర్పాటు చేశారు. రెండు సమావేశ మందిరాలు, ఇతరత్రా రూములు ఖాళీగానే ఉన్నాయి. ఇలా కోట్లాది రూపాయాల ప్రజాధనంలో నిర్మించిన భవనాలను వినియోగించకుండా ఉంచుతున్న అధికారులు.. గురుకులాలు, ఇతరత్రా భవనాలకు అద్దె చెల్లిస్తుండడంతో ప్రజాధనం అవుతున్నది. ఈ విషయమై కలెక్టర్ దృష్టి సారించి భవనాలను ఇతరత్రా అవసరాలకు వినియోగిస్తే ప్రయోజనం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

కుక్కలు, కోతులకు ఆవాసంగా ఐదు కోట్ల ఆర్టీసీ బస్టాండ్..

రూ.5 కోట్ల వ్యయంతో గజ్వేల్ పట్టణానికి కిలోమీటర్ దూరంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ వృథాగా మారిపోయింది. గత ప్రభుత్వం భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్మించగా పట్టణ విస్తీర్ణం పెరగకపోవడంతో ఎందుకు పనికిరాకుండా పోయింది. దీంతో కుక్కలు, కోతులకు ఆవాసంగా మారిపోయింది. బస్టాండ్‌లో లక్షలాది రూపాయలతో ఏర్పాటుచేసిన సీలింగ్ ఫ్యాన్లు, ఇతరత్రా విలువైన వస్తువులను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. బస్టాండ్ ఇతరత్రా అవసరాలకు వినియోగించుకుంటే దుర్వినియోగం కాకుండా చూడొచ్చు.

ఖాళీగా ఎంపీడీవో భవనం..

2009లో అప్పటి ప్రభుత్వం నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనం వృథాగా ఉంటుంది. సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఏర్పాటు చేయడంతో ఎంపీడీవో కార్యాలయాన్ని ఐవోసీలోకి తరలించారు. అప్పటినుంచి లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనం నిరుపయోగంగా మారింది. ఇటీవల కురిసిన వర్షానికి కార్యాలయ ప్రహరీ గోడ సైతం కూలిపోయింది.


గజ్వేల్ పట్టణంలో వృథాగా ఉన్న ఎంపీడీవో కార్యాలయ భవనం

రామగుండం విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కోకు కేటాయించాలి

- 1104 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్


నిరసన తెలుపుతున్న జల విద్యుత్ ఉద్యోగులు

పుల్‌కల్, సెప్టెంబరు 27: రామగుండంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించతలపెట్టిన థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కోకు కేటాయించాలని 1104 విద్యుత్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గా అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని సింగూరు ప్రాజెక్టు జల విద్యుత్ కేంద్రం వద్ద శుక్రవారం జెన్‌కో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సింగరేణి భాగస్వామ్యంతో రామగుండం విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని సూచించారు. వచ్చే నెల 6వ తేదీ వరకు వివిధ రూపాల్లో తాము నిరసన వ్యక్తం చేస్తామని యూనియన్ రీజినల్ అధ్యక్షుడు కలాలి చంద్రయ్యగౌడ్ తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పాండయ్య, యూనియన్ నాయకులు నాగరాజు, శ్రీనివాస్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల పనులు జరగనివ్వం

- కొనసాగుతున్న భూ నిర్వాసితుల ఆందోళనలు


టీజీఐఐసీ భూముల వద్ద భూనిర్వాసితులు ఆందోళన

వర్గల్, సెప్టెంబరు 27 : టీజీఐఐసీ కోసం గత ప్రభుత్వం సేకరించిన భూములకు సంబంధించి పూర్తి స్థాయిలో పరిహారం అందేవరకు పరిశ్రమల నిర్మాణ పనులు జరగనివ్వమని భూనిర్వాసితులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వర్గల్ టీజీఐఐసీ భూముల వద్ద భూనిర్వాసితులు చేస్తున్న ఆందోళన కార్యక్రమం శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారంతా అక్కడే వంట వార్పు చేసుకుంటూ పరిశ్రమలకు వెళ్లే దారిలో బైఠాయించారు. భూములు కోల్పోయిన రైతులందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తామని చెప్పినా ఇప్పటికీ స్థలాలు చూపలేదన్నారు. తమకు పూర్తి స్థాయిలో న్యాయం జరగకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ఎకరాకు రూ. 18లక్షలతో పాటు పరిశ్రమల్లో ఉపాధి అవకాశం కల్పించాలన్నారు. భూ సేకరణలో అవకతవకలు జరిగాయిని వాటిని విచారించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయ్యాలని డిమాండ్ చేశారు.

ఉచిత న్యాయ సహాయం పొందండి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీ చంద్ర


ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీ చంద్ర

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 27 : అర్హత గల కక్షిదారులు న్యాయ సహాయాన్ని ఉచితంగా పొందాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర కోరారు. సంగారెడ్డిలోని జువైనల్ జస్టిస్ బోర్డులో న్యాయ సహాయ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఈ కేంద్రంలో ఒక న్యాయవాదితో పాటు పారా లీగల్ వలంటీర్ అందుబాటులో ఉంటారని, ఎవరికైనా న్యాయ సలహాలు అవసరముంటే సద్వినియోగం చేసుకోవాలన్నారు. జువైనల్ జస్టిస్ బోర్డులో నిర్బంధించబడిన, నేరారోపణ చేయబడిన పిల్లలను తీసుకువస్తారని తెలిపారు. బాల్య నేరస్తులను సాధారణ క్రిమినల్ కోర్టుకు తరలించనందున ఇది వారికి ప్రత్యేక కోర్టుగా పనిచేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి శాలిని తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

జిన్నారం, సెప్టెంబరు 27: అండర్-19 అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 28నుంచి వరంగల్‌లో నిర్వహించే ఇంటర్ డిస్ట్రిక్ అండర్-19 క్రికెట్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు పాఠశాలకు చెందిన విద్యార్థి అంజి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రతాప్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ రాహుల్‌రాజ్


కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 27: స్వాతంత్ర్య సమరయోధుడు, మూడు తరాల తెలంగాణ పోరుబిడ్డ, ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బాపూజీ 109వ జయంతి సందర్భంగా శుక్రవారం వెనుకబడిన తరగతులు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఆయన చేసి కృషి మరువలేనిదన్నారు. అంతకుముందు స్థానిక రాందాస్ చౌరస్తాలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీసీ అభివృద్ధి అధికారి నాగరాజ్‌గౌడ్, పద్మాశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాములు, బీసీ సంఘం అధ్యక్షుడు గంగారాం, నాయకులు సత్యనారాయణ, చెన్న రాంచంద్రం, సంతోష్ శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఏఈవోలపై డిజిటల్ పని ఒత్తిడి తగ్గించాలి

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్


సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 27: వ్యవసాయ విస్తరణ అధికారులపై అదనంగా డిజిటల్ క్రాప్ సర్వే పని భారం తగ్గించాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక సంఘ భవనంలో ఏఈవోల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇదివరకే పంటల నమోదు కార్యక్రమాన్ని విజయంతంగా పూర్తి చేసి సాధారణ విధులు నిర్వహిస్తున్న ఏఈవోలకు అదనంగా డిజిటల్ క్రాప్ సర్వే పేరుతో వేల ఎకరాల భూములను సర్వే చేస్తూ ప్రతి సర్వే నెంబర్‌తోపాటు ప్రతి గుంట యాప్‌లో రికార్డు అయ్యే విధంగా అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ చేయడంతో ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఈవో అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్‌రెడ్డి ప్రశాంత్, టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షులు ఫజులొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గీతం యూనివర్సిటీ హాస్టల్లో విద్యార్థిని ఆత్మహత్య


వర్ష (ఫైల్)

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబర్లు 27: రుద్రారం గీతం యూనివర్సిటీ విద్యార్థిని వర్సిటీ హాస్టల్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. సాటి విద్యార్థులు.. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన నాగల్లి వర్ష (19) గీతం యూనివర్సిటీ బాలికల హాస్టల్‌లో ఉంటూ బీటెక్ సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకే కాలేజీకి వచ్చిన వర్ష 10 గంటల సమయంలో తిరిగి హాస్టల్‌కు చేరుకుంది. అనంతరం మరోసారి కాలేజీకి వెళ్లి మళ్లీ హాస్టల్‌కి వచ్చింది. ఏం జరిగిందో ఏమో కానీ తన గదిలో ఫ్యానుకు బెడ్ షీట్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హాస్టల్‌కి వచ్చిన రూమ్మేట్స్ చూసి వెంటనే వర్సిటీ యాజమాన్యానికి చెప్పడంతో వారు పటాన్‌చెరు పోలీసులకు సమాచారం అందించారు. పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి పూర్తి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే, ఆత్మహత్య చేసుకున్న వర్ష మొదటి నుంచి కొంత ముభావంగానే ఉంటుందని తోటి విద్యార్థులు చెప్పారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీలోకి బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు

- ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో చేరిక..


ఎంపీ రఘునందన్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న ఉద్యమకారుడు మహేష్

మనోహరాబాద్, సెప్టెంబరు 27: మాజీ సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గమైన గజ్వేల్‌లో ఆ పార్టీ నేత ఒకరు బీజేపీలో చేరారు. మనోహరాబాద్ మండల బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, బీఆర్ఎస్ ఉద్యమకారుడు పురం మహేష్ శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఎంపీ ఇంట్లో జరిగిన కార్యక్రమంలో రఘునందన్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ప్రధాని మోదీ అభివృద్ధిని చూసి బీజేపీలో చేరుతున్నారన్నారు. పురం మహేష్ మాట్లాడుతూ ఉద్యమ కారులకు బీఆర్ఎస్‌లో గుర్తింపు లేదని, అందుకే బీజేపీలో చేరినట్లు చెప్పారు. అలాగే ముప్పిరెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ, కాళ్లకల్ గ్రామ మాజీ అధ్యక్షుడు బాలు యాదవ్ చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్, బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌చారి, ముదిరాజ్ సంఘం నేత చంద్రశేఖర్, అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, మల్లేష్, నాగరాజు, నర్సింహులు పాల్గొన్నారు.

గ్యాస్ రీఫిల్‌పై అధికారుల విచారణ

- ఎస్వీఆర్ గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల వినతి


అధికారికి వినతి పత్రం అందజేస్తున్న దామరంచ గ్రామస్థులు

వెల్దుర్తి, సెప్టెంబరు 27 : మండల పరిధిలోని దామరంచ గ్రామంలో ఈ నెల 24న వెల్దుర్తి పట్టణానికి చెందిన ఎస్వీఆర్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది నిండు సిలిండర్ నుంచి ఖాళీ సిలిండర్ లోకి రీఫిల్ చేస్తుండగా పట్టుబడిన ఘటనపై శుక్రవారం సివిల్ సప్లై ఉపతహసీల్దార్ ప్రణీతారెడ్డి దామరంచ గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్యాస్ రీఫిల్ జరిగిన తీరును, ఖాళీ, నిండు గ్యాస్ సిలిండర్ల బరువు విషయాలను అడుగగా 30కిలోలు ఉండాల్సిన నిండు సిలిండర్ 4నుంచి 5కిలోలు తక్కువ రాగా, 15.6 కిలోలు ఉండాల్సిన ఖాళీ సిలిండర్ 18 నుంచి 19కిలోలు వచ్చిందని వివరించారు. అలాగే గ్రామానికి డెలివరీ చేయడానికి వచ్చిన ఏజెన్సీ సిబ్బంది సిలిండర్లను రోడ్లపై పెట్టి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, ఈవిషయమై ఏజెన్సీ నిర్వాకుడు శ్రీనివాస్‌రెడ్డికి చెప్పినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారన్నారు. నిర్వాహకులు, సిబ్బంది చేసిన అక్రమాలపై రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పూర్తి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఉప తహసీల్దార్ తెలిపారు. ఈ విచారణలో ఆర్ఐ జయభరత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

తూప్రాన్, సెప్టెంబరు 27: చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు చెరువలో పడి మృతిచెందాడు. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం తూప్రాన్ మండలం యావాపూర్ మాజీ సర్పంచు గోరిబీ మనవడు దూదేకుల అబ్దుల్ (26) గురువారం సాయంత్రం గ్రామంలోని పెద్దచెరువులో స్నానం చేసేందుకు వెళ్లాడు. చెరువులో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడి మృతిచెందగా, రాత్రి సమయంలో గుర్తించారు. మృతుడు అబ్దుల్ భార్య సమ్రిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

ఇంతకు ప్రాసెస్‌లో ఉందా..!

- పత్తాలేని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులు
- ఐదేళ్లయినా ముందుకు సాగని వైనం
- గతంలోనే 600 ఎకరాల భూ సేకరణ సర్వే పూర్తి
- పూర్తిస్థాయిలో పరిహారంలో అదించడంలో ఆటంకాలు


కోహీర్ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన భూమి

కోహీర్, సెప్టెంబరు 27 : గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లకు ప్రాధాన్యత ఇచ్చేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని కోహీర్, మునిపల్లి మండలాల్లోని వెంకటాపూర్, లింగంపల్లి గ్రామాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలు(ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్) ఏర్పాటు కోసం నిర్ణయించింది. అంతేకాకుండా ఐదేళ్ల కిందటే ఆ ప్రభుత్వం అనుమతులు కూడా మంజూరు చేసింది. అయితే ప్రస్తుతం ఈ గ్రామాల్లో ఎలాంటి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులు జరుగడంలేదు. వీటి ఏర్పాటు కోసం మొత్తం 1200 ఎకరాల భూసేకరణ చేయాలని మొదట నిర్ణయించగా.. ఇరు గ్రామాల్లో మొదటి విడత కింద 600 ఎకరాల కోసం సర్వే పూర్తి చేశారు. ఆ సమయంలో రైతుల నుంచి వ్యతిరేకత ఎదురుకాగా, గ్రామ సభలతో రైతులకు రెవెన్యూ అధికారులు నచ్చజెప్పారు. కోహీర్ మండలంలోని వెంకటాపూర్ గ్రామ రైతులకు ఎకరానికి రూ.15 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని చెప్పగా.. 58 సర్వే నంబర్‌లోని 100 ఎకరాల భూమి గాను ఇటీవల పరిహారం చెల్లించారు. అలాగే మునిపల్లి మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులకు కూడా గతంలో పరిహారం చెల్లించారు. అయినా ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటు కోసం ప్రస్తుతానికి ఎలాంటి పనులు కనిపించడం లేదు. మొదట్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం హడావిడిగా భూ సర్వే చేసిన అధికారులు ప్రస్తుతం మాత్రం మిన్నకుండిపోయారు.

వివిధ కారణాలతో ముందుకు సాగని పనులు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం ప్రభుత్వం సేకరిస్తున్న భూ పరిహారం తక్కువగా ఉందని మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉంటే వెంకటాపూర్, లింగంపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు కబ్జాలో ఉన్నప్పటికీని రికార్డుల్లో పేరు లేకపోవడంతో వారికి పరిహారం అందడం లేదు. రికార్డుల్లో పేరు ఉన్న రైతులు పొజిషన్‌లో లేకపోవడం కూడా అడ్డంకిగా మారింది. ఇలాంటి కారణాలతో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటు జరుగుతుందో లేదోనని పలువురు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భూసేకరణ సమయంలోనే రెవెన్యూ అధికారులు పొజిషన్‌లో ఉన్న, లేని రైతులను గుర్తించారు. అయితే కొంత మంది రైతులకు సర్టిఫికెట్లు ఉన్నాయి కానీ పొజిషన్‌లో లేరు. మరి కొంత మంది రైతులు పొజిషన్‌లో ఉన్నారు కానీ సర్టిఫికెట్లు లేవు ఇలాంటి వారి గురించి ప్రభుత్వం పరిహారం చెల్లించే విషయంలో ఆలోచిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటులో మరింత జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రికార్డు ప్రకారం పరిహారం చెల్లించాలి..



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం వెంకటాపూర్ గ్రామంలోని 58 సర్వే నంబర్‌లో భూసేకరణ చేస్తున్న రెవెన్యూ అధికారులు రైతుల పాస్ పుస్తకంలో ఎంత భూమి ఉంటే అంత పరిహారం రైతులకు చెల్లించాలి. చాలామంది రైతులకు భూమి ఎక్కువగా ఉన్నప్పటికీని సాగులో లేరని తక్కువ పరిహారం చెల్లించడం సరికాదు.

-సుదర్శన్, వెంకటాపూర్

పరిహారం చెల్లించడంలో ఆలస్యం..



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం రెవెన్యూ అధికారులుఏ చేపడుతున్న భూ సేకరణలో రైతులకు పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. మొదట చాలామంది రైతులకు తక్కువ పరిహారం చెల్లించారు. పట్టా పాస్ పుస్తకం ప్రకారం ప్రతీ ఒక్కరికి పూర్తి పరిహారాన్ని చెల్లించాలి.

-ప్రభాకర్, వెంకటాపూర్

గజ్వేల్ డబుల్ బెడ్‌రూం జాబితాపై మరోసారి సర్వే నిర్వహించాలి

- ఆర్డీవోను కోరిన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్, సెప్టెంబరు 27: గజ్వేల్ పట్టణంలో గతంలో ఎంపిక చేసిన డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల జాబితాపై మరోసారి సర్వే నిర్వహించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ఆర్డీవోను కోరారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రెండు జాబితాలు వచ్చినా అర్హుల పేర్లు జాబితాలో రాలేదని, డబుల్ బెడ్ రూం ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయన్నారు. అధికారులు స్పందించి అనర్హులను తొలగించి అర్హులైన వారికి పట్టాలు అందజేయాలని కోరారు. ఆయనవెంట సీఐటీయూ నాయకులు వెంకటాచారి, డబుల్ బెడ్‌రూం బాధితులు పద్మ, కవిత, లక్ష్మి, మంజుల, వసంత, నర్సింహులు, వెంకటేశ్, బాషయ్య తదితరులున్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేనా?

- పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- త్వరగా పూర్తి చేయలంటున్న లబ్ధిదారులు

ములుగు, సెప్టెంబరు 27: గత ప్రభుత్వం ఇళ్లులేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పడంతో వారు కొండంత సంతోషం వ్యక్తం చేశారు. కానీ మండలంలో కొన్ని గ్రామాల్లో మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులు అందజేశారు. మరో రెండు గ్రామాల్లో మధ్యలోనే నిర్మాణాలు నిలిచిపోయాయి. దీనికి ప్రజా ప్రతినిధుల పట్టింపులేని తనం, అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రధానం కారణం. పనులు ముగించాల్సిన కాంట్రాక్టర్లు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ములుగు మండలంలో 26 గ్రామపంచాయతీలు ఉండగా ములుగు 188, క్షీరాసాగర్ 31, శ్రీరాంపూర్ 25, అచ్చాయపల్లి 30, నాగిరెడ్డిపల్లి 25, బస్వాపూర్ 23, బండమైలారం 24 ఇల్లు నిర్మించారు. కొన్ని గ్రామాల్లో స్థలాలు లేకపోవడంతో డబుల్ బెడ్‌రూం నిర్మాణాలు మొదలుకాలేదు. బండమైలారం, బస్వాపూర్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాన్ని కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలేశారు. దీనిపై వారిని సంప్రదించగా ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిపివేశామని వారు చెబుతున్నారు. కానీ ములుగులో నిర్మించిన 188 ఇళ్లలో కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలకు కొన్ని ఇళ్లను కేటాయించారు. ములుగులో నిర్మించిన ఇళ్లు పూర్తిస్థాయిలో కేటాయించకపోవడంతో కొంతమంది విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లో ఉంటున్నా తమకు పట్టాలు ఇవ్వలేదని మరికొందరు లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే ముంపు గ్రామాల ప్రజలకు కేటాయించిన కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు. బండమైలారం, బస్వాపూర్ గ్రామాల్లో నిలిచిపోయిన నిర్మాణాలను సంబంధిత కాంట్రాక్టర్లు చేపట్టకపోతే వారి టెండర్లను రద్దుచేసి కొత్త వారికి టెండర్లు కేటాయించి నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేస్తామని ఏఈ షతతు నీందర్ తెలిపారు.


బండమైలారంలో పూర్తికాని డబుల్‌బెడ్‌రూం ఇళ్లు


ములుగులో పూర్తి అయినా అందరికీ అందని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

దొంగకు సంవత్సరం జైలు, జరిమానా

వర్గల్, సెప్టెంబరు 27: ఇళ్ల తాళాలు ధ్వంసం చేసి పలు చోరీలకు పాల్పడిన వర్గల్ మండలం అంబర్‌పేటకు చెందిన వల్లపు రాజు(29) అనే నిందితుడికి గజ్వేల్ కోర్టు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ. 4000 జరిమానా విధించింది. ఈ కేసుకు సంబంధించి గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి తెలిపిన వివరాల.. అంబర్‌పేటలో ఆగస్టు 8, 9 రాత్రి అదే గ్రామానికి చెందిన నిందితుడు వల్లపు రాజు ఎనిమిది ఇళ్ల తాళాలు ధ్వంసం చేసి చోరీలకు పాల్పడ్డాడు. ఈ విషయమై బాధితులు గౌరారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీలకు పాల్పడింది నిందితుడు వల్లపు రాజుగా గుర్తించి ఆగస్టు 30న అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువుకావడంతో గజ్వేల్ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రియాంక నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ. 4000 జరిమానా విధించారు. నిందితుడిని గుర్తించి శిక్షపడేల చేసిన గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను పోలీసు ఉన్నతాధికారలు అభినందించారు.

ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారిపై చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్ వినతి


సిద్దిపేట అర్బన్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 27: ప్రభుత్వ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులను ఆహ్వానిస్తూ ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు, దుబ్బాక మాజీ జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి కోరారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించి అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, జీడిపల్లి రాంరెడ్డి, పాల సాయిరాం, మోహన్‌లాల్, కొత్త కిషన్ రెడ్డి, శేర్ల కైలాసం, చేపూరి శేఖర్‌గౌడ్, స్వామి, రాజిరెడ్డి, రాజు, భైరాగౌడ్, శ్రీకాంత్, ఎల్లం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

- **రాయపోల్:** ప్రభుత్వం ప్రోటోకాల్‌ను విస్మరిస్తున్నదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ ఆరోపించారు. రాయపోల్‌లో ఆయన మాట్లాడారు. ఆయనవెంట మాజీ జడ్పీటీసీ యాదగిరి, నాయకులు ఉన్నారు.
- **మిరుదొడ్డి:** బీఆర్ఎస్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు రవి అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి మండలాల్లో వేరువేరుగా మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, పరుశురాములు, సురేష్‌గౌడ్, మురళీ, కిషన్, శ్రీనివాస్, రాజు, సిద్దిరాములు, చిరంజీవి, శంకర్‌గౌడ్, జయరాజు, సత్యనారాయణ, ఫైమద్, లింగం, బాల్‌రాజు, సత్తయ్య రాజేశ్వర్, రమేష్, ప్రసాద్ తదితరులున్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిద్దామని అధికారులు, నాయకులు పేర్కొన్నారు. ఆయన జయంతి సందర్భంగా శుక్రవారం కొండ లక్ష్మన్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


సిద్దిపేట టౌన్: లక్ష్మణ్ బాపూజీ విగ్రహనికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు


గజ్వేల్: కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహనికి నివాళులర్పిస్తున్న నాయకులు


హుస్నాబాద్: కొండా లక్ష్మన్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న..


చేర్యాల: లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్..

గ్రామ సహాయకులకు మిషన్‌భగీరథపై అవగాహన

- నాలుగు రోజుల పాటు శిక్షణ

మద్దూరు, సెప్టెంబరు 27: మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామ పంచాయతీలలో నీటి సరఫరా చేసే గ్రామ సహాయకులకు మిషన్‌భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు నాలుగురోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సహాయకులకు వివిధ అంశాలపై చేర్యాల సబ్ డివిజన్ ఇంజనీర్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ డీఈఈ కృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, ఏఈ భూపతి, ట్రైనర్ కనకయ్య పాల్గొన్నారు.


చిన్నకోడూరు: మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

- **చిన్నకోడూరు:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమాన్ని జడ్పీ సీఈవో రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈఈ సుమలత, ఏఈఈ సాయికిరణ్, ఎంపీడీవో జనార్ధన్, ఎంపీవో సోమిరెడ్డి, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- **గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో గ్రామ పంచాయతీల వాటర్‌మెన్, కారోబార్లు, ఎంపీడబ్ల్యూలకు ఏర్పాటు చేసిన శిక్షణ సమావేశంలో భగీరథ గజ్వేల్ ఈఈ శ్రీనివాస్ మాట్లాడారు. వివిధ అంశాలపై వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మిషన్ భగీరథ డీఈఈలు ప్రవీణ్, రాజు, ఎంపీవో దయాకర్, ఏఈ రాజు ఉన్నారు.
- **మిరుదొడ్డి:** మిరుదొడ్డి రైతువేదిలో మిషన్‌భగీరథ మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని మిరుదొడ్డి ఎంపీడీఓ గణేష్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ విక్రమ్‌గౌడ్, ఎంపీవో జహిరోద్దిన్, ఏఈలు తిరుమల్‌రెడ్డి తదితరులున్నారు.

'పర్యాటకంతో మానసిక ఉల్లాసం'


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నిఖత్ అంజూమ్

గజ్వేల్, సెప్టెంబరు 27: పర్యాటకంతో మానసిక ఉల్లాసం కలుగుతుందని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ అంజూమ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యాటకం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని, ప్రతీ ఏటా సెప్టెంబరు 27న అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు ఐక్యూసీ వెంకటేశ్, అకాడమిక్ కోఆర్డినేటర్ లక్ష్మీనర్సయ్య అధ్యాపకులు పాల్గొన్నారు.

'బతుకమ్మ' దళితుల దరిచేరునా?

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 27: ఈసారైనా బతుకమ్మ దళితుల దరిచేరునా? అని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి వ్యాఖ్యానించారు. బతుకమ్మ ఆడని గ్రామాల్లో బతుకమ్మ ఆడే విధంగా పౌరహక్కుల దినం రోజున అవగాహన కల్పించే విధంగా అధికారులకు ఆదేశాలివ్వాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారి యస్.కె అబ్దుల్ రహమాన్‌కి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పున్నయ్య కమిషన్ సిఫారసు ప్రకారం ప్రతీ నెల చివరి రోజున పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలన్నారు. ఆయనవెంట డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు తదితరులు ఉన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

- హుస్నాబాద్‌లో సీపీఎం రాస్తారోకో


రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 27: నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రం నిత్యావసర వస్తువుల ధరలను అడ్డగోలుగా పెంచిందని నిరసిస్తూ శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని మోదీ నిత్యావసర వస్తువుల ధరలను అధికంగా పెంచి సామాన్యుల నడ్డి విరుస్తూ, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు పంచి పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సంజీవ రెడ్డి, పిట్టల బాలయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగామ రాజ్‌కుమార్, పొదిల కుమారస్వామి, పిట్టల ప్రసాద్, ఎండీ. అక్బర్, మల్లారెడ్డి, బాలయ్య తదితరులున్నారు.

అంగన్‌వాడీలో పోషణమాసోత్సవం

చేర్యాల, సెప్టెంబరు 27: చేర్యాల పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-శిలో శుక్రవారం పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలతో సమావేశం నిర్వహించి పోషక ఆహారంపై అవగాహన కల్పించారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీవో రమాదేవి, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'లైంగిక వేధింపులను నిరోధించాలి'

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 27: మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులను నిరోధించాలని, అనాథ శిశువులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు కనకరాజు, లక్ష్మణ్ సూచించారు. బాల బాలికల హక్కులు, విధులు గురించి సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్టూడెంట్ కౌన్సిలర్ కనక చంద్రం అధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు మాట్లాడుతూ.. బాలికలకు ఏదైనా ఇబ్బంది కలిగితే 1098కి కాల్ చేసి సహయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారయణరెడ్డి, అధ్యాపకులు దరిపల్లి నగేష్, దేవయ్య, సుధాకర్‌రెడ్డి, నంటా శ్రీనివాస్‌రెడ్డి, ఆశోక్, గంగాధర్, రఘురాజ్, వెంకటరమణ, రాజ్యలక్ష్మి, సహానా కౌసర్ కుర్సీదా, కొమురయ్య, నవనీత, దాసు, శ్రీనివాస్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

- **కొండపాక:** మహిళల భద్రతకు పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని షీటీం బృంద సభ్యులు పేర్కొన్నారు. కొండపాకలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ స్కూల్లో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి ఏఎస్ఐ శంకర్, గజ్వేల్ షీటీమ్ బృందం ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుళ్లు రాంచంద్రారెడ్డి, మహేష్, భరోసా సెంటర్ సిబ్బంది హరిత, వినోద, సోనీ, ప్రిన్సిపాల్ కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించాలి

- విద్యాశాఖ జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ భాస్కర్


రిసోర్స్ పర్సన్స్‌లను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 27: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీసుకురావడం కోసం ప్రయోగాత్మక విద్య దోహద పడుతుందని విద్యాశాఖ జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ బేతి భాస్కర్ తెలిపారు. సిద్దిపేట స్థానిక బాలుర పాఠశాలలో సైన్స్ అకాడమీ, టెక్ మహింద్రా, సమగ్ర శిక్ష అధ్వర్యంలో ప్రాథమిక ఉపాధ్యాయులకు పరిసరాల విజ్ఞానంపై నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో సిద్దిపేట అర్బన్ ఎంఈవో రాజప్రభాకర్‌రెడ్డి, కాంప్లెక్స్ విజయ్, కో ఆర్డినేటర్లు పీవీ సత్యకూమార్, గోవర్దన్, పి. శ్రీనివాస్, సత్యనారయణ, రాజనరేందర్, ప్రవీణ్, బాల భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాలోని ఎంపిక చేసిన 40 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదర్శ వివాహం

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 27: హంగు ఆర్భాటం లేకుండా స్టేజీపై దండలు మార్చుకుని కుల మతాలకు అతీతంగా ఒక్కటైన నూతన జంటను సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో శుక్రవారం పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, స్వేచ్ఛల వివాహనికి ఆయన హాజరై ఆశీర్వదించారు. ఈ వివాహనికి సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చలపతిరావు, ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సూర్యం, తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర నాయకుడు వెంకటరామయ్య, రాష్ట్ర నాయకుడు గోవర్ధన్, పీవోడబ్ల్యూ జాతీయ నాయకులు ఝాన్సీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీత, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణ, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్, కే శ్రీనివాస్, రాజేష్, క్రాంతి, రానా, ప్రతాప్, సింహాద్రి ఉన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య


దుబ్బాక: జ్యోతిని వెలిగించి మండల స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న బక్కి వెంటకయ్య

మిరుదొడ్డి, సెప్టెంబరు 27: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రమైన ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తిభోజనాన్ని చేశారు.

- **దుబ్బాక:** క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండిటిని సమానంగా తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. దుబ్బాక మున్సిపాలిటీలోని లచ్చపేట ఆదర్శ పాఠశాలలో కేకేఆర్ ట్రస్టు అధినేత కొమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి సహకారంతో మండలస్థాయి క్రీడ పోటీలను మున్సిపల్‌చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభుదాస్, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు బంగారయ్య, శ్రీజ, స్వామి, యాదగిరి తదితరులున్నారు.

సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు దోహదం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

ములుగు, సెప్టెంబరు 27: పిల్లలు శారీరకంగా, మానసికంగా, సామాజికంగా పరిణితి చెందడానికి, చదువుతో పాటు క్రీడలూ ఎంతగానో ఉపయోగపడతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. మండలంలోని తునికిబొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. రెండురోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీల్లో మండలంలోని 14 పాఠశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొననున్నారు.

- **కొండపాక:** సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. మండలంలోని అంకిరెడ్డిపల్లి పీజీహెచ్ఎం గోపాల్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, కొండపాక ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, గోపాల్‌రెడ్డి కుటుంబసభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

'తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి'

మర్కుక్, సెప్టెంబరు 27: ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని, ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడిని నియమించి ప్రాథమిక విద్యావ్యవస్థను పటిష్ఠం చేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బాల్రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య పేర్కొన్నారు. మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్రాములును మర్కుక్ మండలశాఖ టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాములపర్తి ప్రధానోపాధ్యాయుడు సైదా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేబర్తి ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

- **మద్దూరు:** విద్యాశాఖలో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం కోసం సర్దుబాటు పేరుతో విడుదల చేసిన అశాస్త్రీయమైన జీవో 25ను వెంటనే సవరించాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి డిమాండ్ చేశారు. వివిధ మండలాల్లోని పాఠశాలలను శుక్రవారం సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గణేష్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రాజమల్లు, రాజిరెడ్డి ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


కొండపాక: బహుమతులు అందజేస్తున్న డీపీవో

కొండపాక, సెప్టెంబరు 27: పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని జిల్లా పంచాయతీ అధికారిని దేవకీదేవి అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా దుద్దెడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో విష్ణు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

- **దూళిమిట్ట:** స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దూళిమిట్ట, లింగాపూర్, జాలపల్లి, తోర్నాల గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మద్దూరు పీహెచ్‌సీ వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, వైద్యాధికారి రజిత, కార్యదర్శులు సిద్దేశ్వర్, రాజుగౌడ్, పున్న శ్రీనివాస్, ఏఎన్ఎం స్వరూప, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.
- **హుస్నాబాద్ టౌన్:** హుస్నాబాద్ పట్టణంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సైక్లతాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, బొజ్జ హరీశ్ ఉన్నారు.

తొగుట ఎంఈవోగా నర్సయ్య బాధ్యతల స్వీకరణ

తొగుట, సెప్టెంబరు 27: తొగుట మండల ఎంఈవోగా ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎంఈవో యాదవరెడ్డి బదిలీపై చిన్నకోడూర కు వెళ్లారు. ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన నర్సయ్యను వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు.

నారాయణరావుపేట ఎంఈవోగా..

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 27: నారాయణరావుపేట మండల విద్యాధికారిగా గౌరి మోహన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నారాయణరావుపేట ఇన్‌చార్జి ఎంఈవోగా పని చేసిన యాదవరెడ్డి చిన్నకోడూరుకు బదిలీపై వెళ్లారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న గౌరి మోహన్‌కు మండల విద్యాధికారిగా ప్రభుత్వం నియమించింది. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఎర్రవెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఎంఈవోను సన్మానించారు. కార్యక్రమంలో చిన్నకోడురు ఎంఈవో యాదవరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నీరడి లక్ష్మీనారాయణ, మండల గౌరవ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 30న జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 27: వచ్చే నెల 8, 9న హనుమకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు గాను, ఈనెల 30న సిద్దిపేట పట్టణంలోని మైదానంలో ఉదయం 8 గంటలకు అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా, సిద్దిపేట జిల్లా ఎంపిక పోటీలు ఉంటాయని అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామిగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 100, 800, 3000 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు జనన ధ్రువీకర పత్రం, ఎస్ఎస్‌సీ మెమో జిరాక్స్‌తో ఈనెల 29న 6 గంటలల్లోపు అథ్లెటిక్స్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 8501977079, 9666020322, 9704061543 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వర్గల్ మండల రెడ్డి జాగృతి అధ్యక్షుడిగా యెర్ర మోహన్‌రెడ్డి

వర్గల్, సెప్టెంబరు 27: వర్గల్ మండల రెడ్డి జాగృతి అధ్యక్షుడిగా యెర్ర మోహన్‌రెడ్డి ఎన్నికైయ్యారు. రెడ్డి జాగృతి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దేవుడి నర్సింహ్మారెడ్డి వర్గల్ మండల రెడ్డి జాగృతి అధ్యక్షుడిగా యెర్ర మోహన్‌రెడ్డిని ప్రకటిస్తూ శుక్రవారం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు కొండల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


కేజీబీవీలో ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బెజ్జంకి, సెప్టెంబరు 27: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తూ మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆదర్శ పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, ఎంఈవో, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భోజనతయారీలో నిర్లక్ష్యం వద్దు

- డీఈవో శ్రీనివాస్‌రెడ్డి


మరుగుదొడ్ల పనులను పరిశీలిస్తున్న డీఈవో

చేర్యాల, సెప్టెంబరు 27: భోజనతయారీలో నిర్లక్ష్యం వద్దని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన తీరుపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన తయారీ గదిని పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న మూత్రశాలలు, మరుగుదొడ్ల పనులు పరిశీలించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు. పాఠశాలకు ప్రహరీ లేక ఇబ్బందులుపడుతున్నారని స్థానికులు ఈగ కనకయ్య, కంకణాల శ్రీనివాస్ డీఈవోకు విన్నవించారు.

మొదలైన బొడ్డెమ్మ సంబురం


బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 27: బొడ్డెమ్మ పండుగ సంబురం మొదలైంది. ఆడపడుచులు బొడ్డెమ్మలను తయారుచేసి తీరొక్క పూలతో అలంకరించారు. ఎర్రమట్టితో అలికి ముగ్గులు వేసి బొడ్డెమ్మలను పెట్టి చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో బొడ్డెమ్మను వేడుకున్నారు. కొంతమంది గల్లీలో పెడితే, మరి కొంతమంది అపార్ట్‌మెంట్‌లో బొడ్డెమ్మను కొలిచారు.


మల్లన్న ఆలయంలో ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్, తదితరులు

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

- గజ్వేల్ ఏడీఏ బాబునాయక్

రాయపోల్, సెప్టెంబరు 27: వరిపంటలో చీడపీడలు, తెగుళ్ల నివారణకు రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే మంచి ఫలితాలు పొందుతారని గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు బాబూనాయక్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లిలో వరి పంటను శుక్రవారం మండల వ్యవసాయాధికారి నరేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. వరి పంటల్లో వచ్చే చీడపీడలు, తెగుళ్ల నివారణకు వినిమోగించాల్సిన మందుల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

- **సిద్దిపేట అర్బన్:** మండలంలోని బక్రిచెప్యాల, వెల్కటూర్ గ్రామాల్లో వ్యవసాయశాఖ మండల అధికారి శ్రీనాథ్ పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటకు ఎటువంటి రోగాలు వస్తాయి, ఎటువంటి మందులు వాడాలి అనే విషయంపై రైతులకు అవగాహన కల్పించారు.
- **జగదేవ్‌పూర్:** పత్తి పంటలో రసంపీల్చే పురుగులు, పొగాకు లద్దె పురుగును గుర్తించినట్లు మండల వ్యవసాయ అధికారి వసంతరావు తెలిపారు. మండలంలోని బస్వాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లోని పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల కారణంగా పంటలకు చీడపీడల బెడద పెరుగుతున్నట్లు గమనించి రైతులకు తగు సూచనలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి కిరణ్, రైతులు పాల్గొన్నారు.
- **మర్కుక్:** మండల పరిధిలోని ఇప్పలగూడెంకు చెందిన సామల సంజీవరెడ్డి వ్యవసాయ పొలంలో మండలంలోనే మొదటిసారిగా ఆయిల్‌పామ్ కోత ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ పంటని నేరుగా నంగునూరులోని నర్మెటలో ఉన్న ఫ్యాక్టరీకి తరలిస్తారని చెప్పారు. ఆయనవెంట వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్, ఆయిల్‌ఫెడ్ అధికారి విజయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


రాయపోల్: మండలం కొత్తపల్లిలో వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాబునాయక్, తదితరులు